రేషన్ బండి.. ఆపొద్దండి



కనుమరుగవనున్న రేషన్ వాహనాలు

- పాత పద్ధతిలో ఇంటి వద్దే సరకులు ఇవ్వాలని కోరుతున్న మహిళలు
- రేషన్ షాపుల వద్ద క్యూ కట్టలేమని ఆవేదన
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డున పడ్డామంటున్న ఎండీయూ ఆపరేటర్లు

అల్లిపురం:

రేషన్ సరకులను ఇకపై ఇంటి వద్ద అందించే విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై పేదల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత ఐదేళ్లుగా ఇంటి వద్దకే రేషన్ సరకులు అందించిన ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను నిలిపివేయడంతో, మళ్లీ పాత పద్ధతిలో రేషన్ షాపులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే రేషన్, పింఛన్లు, ఇతర ప్రభుత్వ సేవలను అందించేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్లను తొలగించడంతో, ప్రజలు ఇప్పుడు సచివాలయాలు, తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి గుమ్మం వద్ద లభించిన సేవలు అకస్మాత్తుగా నిలిచిపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల సేవ తమ అజెండాలో లేదన్న సంకేతాలను కూటమి ప్రభుత్వం ఇస్తోందని వారు ఆరోపిస్తున్నారు. ఈ నిర్ణయంతో పేదలు పాత కష్టాలు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

సర్కిల్–1 పరిధిలో..

రెండు డిపోలకు ఒక రేషన్ బండి చొప్పున సర్కిల్–1 పరిధిలో 30 ఎండీయూ వాహనాల (రేషన్ బళ్లు) ద్వారా ప్రతి నెలా రేషన్ సరుకుల పంపిణీ జరుగుతోంది. ప్రతి వార్డులో మురికివాడలు, కాలనీలు, స్కీం ఇళ్ల వద్దకు రేషన్ బండి వచ్చి సరుకులు అందజేసేది. నాలుగేళ్లుగా అలవాటైన పద్ధతిని రద్దు చేయటంతో సర్కిల్ 1 పరిధిలో 150 రేషన్ డిపోల పరిధిలో సుమారు లక్ష మంది లబ్ధిదారులుకు తిరిగి కష్టాలు మొదలైనట్లే, మరలా పడిగాపులు కాయమనడం సబబేనా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

ఎండీయూ ఆపరేటర్ల పొట్ట కొట్టారు

రేషన్ సరకుల పంపిణీకి ఉపయోగించిన ఎండీయూ వాహనాలను ప్రభుత్వం అకస్మాత్తుగా రద్దు చేయడం సరికాదు. 72 నెలల ఒప్పందంలో ఇంకా 20 నెలలు మిగిలి ఉండగానే మమ్మల్ని తొలగించడం అన్యాయం. మిగిలిన 20 నెలలకు ఈఎంఐల పరిస్థితి ఏమిటి? మా కుటుంబాలు ఎలా గడవాలి? గతంలో డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ జరిగినప్పుడు కేవలం 60 శాతం మాత్రమే జరిగేది, ఎండీయూ వాహనాలు వచ్చాక అది 90 నుంచి 95 శాతానికి పెరిగింది. నెలకు రూ.10 వేల జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు మాపొట్ట కొట్టడం అన్యాయం. మా ఉపాధికి భరోసా ఏది?

– షేక్ హుస్సేన్, ఎండీయూ ఆపరేటర్

ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి

అల్లిపురం బంగారుమెట్ట కాలనీలో సుమారు 400 కుటుంబాలు ఉంటున్నాయి. మహిళలు ఇళ్లల్లో, మగవాళ్లు కూలిపనికి పోతాం. కొన్నేళ్లుగా ఇంటి గుమ్మం వద్ద రేషన్ ఇస్తున్నారు. పనులకు వెళ్లి వచ్చి తిరిగి రేషన్ షాపుల వద్ద లైన్ కట్టి గంటల తరబడి ఉండలేం. తీరా వెళ్లాక షాపు తీస్తారో తియ్యరో తెలియదు. షాపు తీసినా సరుకులు ఉన్నాయంటారో లేవంటారో అని సందేహం. మళ్లీ ఆ పాట్లు పడలేం.ప్రస్తుతం ఇస్తున్న విధానంలోనే ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి.

– పిల్లి శివ, అల్లిపురం

వీధిన పడతాం

గత ఐదేళ్లుగా 32,33 వార్డుల్లో రేషన్ బండి డ్రైవర్‌గా సేవలందిస్తున్నాను. వెహికల్ కోసం రూ.70 వేలు కట్టా. నెలకు రూ.23 వేలు ఇస్తున్నారు. అందులో మూడు వేలు వెహికల్ ఈఎంఐకి, 5 వేలు తూకం వేసే హమాలీకి, మరో మూడు వేలు పెట్రోల్‌కి వెచ్చిస్తున్నాం. ఇక డ్రైవర్‌కి మిగిలేది కేవలం రూ. 10 వేలు. నెలలో 15 రోజులు పని ఉండేది. మిగతా రోజులు ఆటో వేసి కుటుంబాన్ని పోషిస్తున్నాను. అకస్మాత్తుగా తొలగిస్తే మాలాంటి వారి పరిస్థితి ఏమిటి?

– నీరుకొండ సతీష్ , ఎండీయూ వెహికల్ ఆపరేటర్

మా డిపో ఎక్కడుందో తెలియదు

మా డిపో ఎక్కడుందో తెలియదు. వెదుక్కుంటూ వెళ్లినా సరకులు ఉంటాయో లేదో తెలియదు. గతంలో వలంటీర్లు ఏ అవసరమైనా అందుబాటులో ఉండేవారు. రేషన్ బళ్లు వస్తే ఇంటి వద్దే సరకులు తీసుకునేవాళ్లం. ఏడాదిగా వలంటీర్లు లేకపోవడం, ఇప్పుడు రేషన్ బండి కూడా రాకపోవడం మాలాంటి పెద్ద వయసు వారికి చాలా ఇబ్బంది.

– జగన్నాథం ఈశ్వరమ్మ, అల్లిపురం

ఉన్న సౌకర్యాలైనా కొనసాగించాలి

చంద్రబాబు కొత్త పథకాలు ఇవ్వకపోయినా పర్వాలేదు. ఉన్న పథకాలను తీయకుండా ఉంటే బాగుంటుంది. కొద్ది సంవత్సరాలుగా ఇంటి వద్దకే రేషన్ ఇవ్వడం వల్ల ముఖ్యంగా మహిళలు, ఒంటరి మహిళలు, వృద్ధులు లబ్ధి పొందారు. ఇప్పుడు రేషన్ డిపోల ద్వారా రేషన్ ఇస్తామంటే ఆ డిపోలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. వలంటీర్ వ్యవస్థను తొలగించారు. విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పుడు రేషన్ బండ్లు తొలగిస్తున్నారు. ప్రజలకు మేలు చేయకపోయినా పర్వాలేదు, ఉన్న సౌకర్యాలను తొలగించకండి.

– నీలాపు అయ్యప్పరెడ్డి, అమ్మవారివీధి

క్లుప్తంగా

శాకాంబరిగా ఎర్నిమాంబ

- ఘనంగా అమ్మవారి మారువారం పండగ



కాయగూరల అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురం–అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి మారువారం జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం వేకువజామున 5 గంటల నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ ప్రత్యేకంగా అమ్మవారికి అలంకరణ చేశారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, ప్రసాదం వితరణ చేశారు. కార్యనిర్వహణాధికారి డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి

కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల్లో భాగంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీతపై ప్రవచనాలు అందించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి వార్లను దర్శించుకున్నారు.

అమ్మవారి పండగకు రూ.10వేల విరాళం



పీతల వాసుకు పండగ ఆహ్వానపత్రిక అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ముత్యాలమ్మ ఆలయ 25వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. జీవీఎంసీ 29వ వార్డు నౌరోజీరోడ్డు ఊటగెడ్డలో కొలువుదీరిన గోకుల్ రోడ్డు ప్రజల ఆరాధ్యదైవమైన అమ్మవారి పండగను ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల వాసుకు పండగ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి పండగను వైభవంగా జరిపించాలని కోరుతూ వారికి రూ.10 వేలు విరాళం అందించారు.

కొనసాగుతున్న ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె ఆరో రోజు ఆదివారం కూడా కొనసాగింది. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లతో ఈనెల 20 నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు దిగాయి. అయితే యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లుల చేయడం వల్ల ఉత్పత్తికి పెద్దగా అంతరాయం కలగడం లేదని సమాచారం. ఇదిలా ఉండగా కార్మిక సంఘాల ప్రతినిధులు కార్మికుల నివాసాలకు వెళ్లి సమ్మెకు సహకరించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న కొత్తమ్మ వారి ఉత్సవాలు

- ఆదివారం గ్రామంలో తిరిగిన ఉజ్జిడి బండి
- నేడు పుట్ట పూజ, పుట్ట బంగారం



విశేష అలంకరణలో అమ్మవారు

అల్లిపురం: అమ్మవారివీధి వాసుల ఆరాధ్య దైవం కొత్తమ్మ జాతర మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ నెల 13న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి ఉజ్జిడి బండి గ్రామంలో తిరిగింది. అమ్మవారివీధి అల్లిపురం మెయిన్‌రోడ్డు మీదుగా అల్లిపురం మార్కెట్ రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ మీదుగా ఈ బండి సాగింది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

నేడు పుట్ట బంగారం

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి పుట్ట బంగారం సోమవారం ఉదయం జరుగుతుందన్నారు. అమ్మవారికి పసుపు కుంకుమలు తీసుకుని పుట్ట వద్దకు వెళ్లి, పూజలు చేసిన అనంతరం పుట్టబంగారం తీసుకురావడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగండి

మల్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ సమీర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి గొడవలు, తగాదాల జోలికి పోకూడదన్నారు. హద్దు మీరి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ప్రతిక్షణం ఉంటుందని, నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని సూచించారు.

భళా.. బాల



పేపర్లతో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల అలంకరణ వస్తువులు



మురళీనగర్: అవకాశమిస్తే చిన్నారులు తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తారు. కేవలం చదువులోనే కాదు.. పూర్తి స్వేచ్ఛనిస్తే చాలు.. తాము కూడా అనేక కళాఖండాలను సృష్టిస్తామని చాటుతున్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాలు వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ ద్వారా వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. దీంతో అనేక మంది విద్యార్థులు ఈ శిబిరాల్లో పాల్గొని తమలోని కళాత్మకతను చాటారు. చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్క్, పెయింటింగ్ వంటి అనేక విభాగాల్లో తమ ప్రతిభ చూపి భళా.. బాల అని అనిపించుకున్నారు.

విభిన్న అంశాల్లో ప్రతిభ

మురళీనగర్ బాలలు, మహిళల గ్రంథాలయంలో 20 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులు తమ విశేష ప్రతిభ చాటారు. ముఖ్యంగా పుస్తక పఠనంపై వీరు ఆసక్తి పెంచుకున్నారు. కథలు చదవడం, చెప్పడం, పద్యాలు పఠించడంతోపాటు తాము చదివిన అంశాలపై వేదికపై మాట్లాడి ఆత్మవిశ్వాసాన్ని సాధించారు. పేపర్ క్రాఫ్ట్ ద్వారా వివిధ రకాల అలంకరణ వస్తువులను తయారు చేశారు. పెయింటింగ్, చిత్రలేఖనంలో ప్రతిభను ప్రదర్శించారు. ఈ వేసవి శిబిరాలను తాము విజయవంతంగా వినియోగించుకున్నామని చిన్నారులు తెలిపారు. ఆటలు, పాటలతో ఈ వేసవి సెలవులను ఆనందంగా గడుపుతున్నారు.

సృజనాత్మక ప్రదర్శనలు

మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, పాట్ పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, సీడీ, శారీ పెయింటింగ్‌ల్లో శిక్షణ పొందారు. మౌల్డింగ్ ఆర్ట్‌లో వీరు తమ సృజనాత్మకతను ప్రదర్శించి కళారూపాలు తయారు చేసి ప్రదర్శించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన శిక్షణలో భగవద్గీత పఠనం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లో శిక్షణ పొందారు. ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో నిర్వహించిన శిక్షణ శిబిరంలో స్టెయిన్ వుడ్ మ్యూరల్ ఆర్ట్, ఓహెచ్‌పీ షీట్ ఆర్ట్, టార్టోయిస్ ఆర్ట్, 3డీ అవుట్ లైనర్ ఆర్ట్, వెజిటబుల్ పెయింటింగ్‌లో శిక్షణ ఇవ్వగా.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు.



చిన్నారులు తయారు చేసిన కళాఖండాలు



తయారు చేసిన పేపర్ క్రాఫ్ట్‌లను చూపిస్తున్న బాలలు



వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ఆటోను ఢీకొట్టిన కారు

ఆరుగురికి గాయాలు, ఆస్పత్రిలో చికిత్స

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అగనంపూడికి చెందిన భాస్కర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామం పలాసలో జరుగుతున్న గ్రామదేవత పండగకు పయనమయ్యాడు. ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకునేందుకు వీరంతా ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అగనంపూడి నుంచి ఆటోలో బయలుదేరారు. తాటిచెట్లపాలెం సమీపంలోకి వచ్చేసరికి రైల్వే న్యూకాలనీ రోడ్డు నుంచి వచ్చిన ఓ కారు వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కారు ఢీకొనడంతో ఆటో దెబ్బతింది. ఆటో డ్రైవర్ కె.కాశీరావు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఉమామహేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కారు ఢీకొట్టడంతో దెబ్బతిన్న ఆటో

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలను వేదికగా చేసుకుని ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వారు స్థిరపడిన వృత్తులు, కుటుంబ విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు వెల్ఫేర్ గ్రూప్‌గా ఎవరికి ఏ కష్టమొచ్చినా.. సహకరిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. పాఠశాల చదువులు వదిలి 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి, సందడిగా గడిపారు. ఫొటోలు తీసుకుని, జ్ఞాపకాలతో వెనుదిరిగారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మాధవధార ప్రాంతానికి చెందిన పి.ఉమా వెంకట సత్యనారాయణ లక్షా 5 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయ డొనేషన్ కౌంటర్లో ఇచ్చారు. దేవస్థానం తరపున అన్నప్రసాద విభాగం ఏఈవో ఆనంద్‌కుమార్, పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్ అందించారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో

హృదయపూర్వక సమర్పణమే ‘శ్రీకృష్ణ అర్పణం’

తగరపువలస: శ్రీకృష్ణునికి హృదయపూర్వక సమర్పణ అందించే కార్యక్రమమే ‘శ్రీ కృష్ణ అర్పణం’ అని, అందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని అంబరీష దాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలోని శ్రీరాధా మదన్‌మోహనుల మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 7 వరకు శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమం కనులపండువగా జరిగింది. మురళీనగర్‌కు చెందిన శ్రీ సంజన కూచిపూడి నృత్యాలయం కళాకారులు సంగీతసేవ నిర్వహించారు. అంబరీష దాస మాట్లాడుతూ ప్రతి వారం ఈ ప్రత్యేకమైన శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా భక్తి కళాకారులచే సంగీత, నృత్య, సంప్రదాయ కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీరాధా మోహనులకు ప్రత్యేక పూజలు చేశారు. జూన్ 1న జరిగే శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో పాల్గొనాలనుకునే కళాకారులు 95425 11108లో సంప్రదించాలని కోరారు.



నృత్య ప్రదర్శనలో మురళీనగర్‌కు చెందిన కళాకారులు

బీచ్‌లో మెరైన్ ఎస్‌ఐ పర్యటన

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌ను ఆదివారం ఉదయం మెరైన్ పోలీసులు సందర్శించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగరానికి రానున్న నేపథ్యంలో బీచ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు మెరైన్ ఎస్‌ఐ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మురళీకృష్ణ పర్యాటకులు, మత్స్యకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. భద్రత దృష్ట్యా ప్రతిరోజు ఎంతమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శిస్తున్నారు, మత్స్యకారుల పూర్తి వివరాలను సేకరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో పాటు, బీచ్ పరిసరాల్లో స్థానికేతరుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు ఎవరైనా తీర ప్రాంతాల్లో సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.



పర్యాటకులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్‌ఐ మురళీకృష్ణ